వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
గురువారం 05 నవంబర్ 2026

## పోలీసుల అదుపులో వైకాపా నాయకులు

**దువ్వూరు, నవంబర్ 04, ప్రభాతవార్త:**
మండల పరిధిలో గురువారం జరిగే ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సమయంలో కొంతమంది వైకాపా నాయకులను బుధవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... గురువారం మండలంలోని చల్లబసాయి పల్లె, నీలాపురం ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారో లేక ఇతర కారణాలో తెలియదు కానీ కొంతమంది వైకాపా నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలించారు. నీలాపురం ఎంపీటీసీ స్థానంలో ఎక్కువ మంది వైకాపా నాయకులు ఉన్నా వారిని అదుపులోకి తీసుకోలేదు. కేవలం చల్లబసాయి పల్లె ఎంపీటీసీ స్థానానికి చల్లబసాయి పల్లె, పుల్లారెడ్డి పేట, సంజీవరెడ్డి పల్లెలకు చెందిన వైకాపా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ వ్యవసాయ సలహాదారుడు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డిని బుధవారం సాయంత్రం ఇంటి వద్ద పోలీసులు మోహరించి అదుపులోకి తీసుకొని మైదుకూరుకు తరలించారు. అలాగే మరి కొంతమంది నాయకులను కూడా వైకాపా నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

## ఎన్నికల వేళ పోలీసుల డేగకన్ను

### జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వాహన తనిఖీలు

**మదనపల్లె క్రైమ్, నవంబర్ 4, ప్రభాతవార్త:**
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను తీవ్రతరం చేశారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా తరలించే నగదు, మద్యం, అలాగే ఉచిత బహుమతుల రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా జిల్లాలోని సరిహద్దు మార్గాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద ప్రయాణించే కార్లు, ఇతర వాహనాల క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరియైన ఆధారాలు (రసీదులు) లేని నగదు, నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత వస్తువులను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా జరగడానికి ప్రజలు, వాహనదారులు పోలీసు తనిఖీలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడే పరిషత్ పోరు

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

## కడప జిల్లాలో 16 జడ్పీటీసి, అన్నమయ్య జిల్లాలో 22 జడ్పీటీసిలు ఎన్నికలు

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

## కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## అన్నమయ్య జిల్లా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**కడప, నవంబర్ 4, ప్రభాతవార్త బ్యూరో**
వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలో పరిషత్ పోరుకు సర్వం సిద్ధమైంది. కడప జిల్లాలో 16, అన్నమయ్య జిల్లాలో 22 జడ్పీటీసి స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. కడపలో 23 జడ్పీటీసి స్థానాలు ఏకగ్రీవం కాగా, అన్నమయ్య జిల్లాలో 3 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న రాయచోటి నియోజకవర్గం లోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, రాయచోటి జడ్పీటీసిలు అధికార పార్టీకి ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. గత 10 రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు జోరుగా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థుల గెలుపుకోసం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించగా వైసిపి తరపున ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు తదితర నేతలు ప్రచారం చేశారు. ఇప్పటికే కొన్ని జడ్పీటీసిలను ఏకగ్రీవం కూటమి ఖాతాలో వేసుకుంది. ఎన్నికలు జరగనున్న మిగిలిన చోట్ల అభ్యర్థుల మధ్య గెట్టి పోటి అనివార్యమైంది. అన్ని జడ్పీటీసి, మండల పరిషత్‌లను కైవసం చేసుకోవాలని కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఎన్నికల కోసం వ్యూహ రచన చేయగా, వైసిపికి చెందిన నేతలు కూడా తమ పార్టీ అభ్యర్థులను గెలుపించుకొనేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక పోరులో గురువారం అభ్యర్థులు తమ భవితవ్యా న్ని పరిక్షించుకోనున్నారు.

వైఎస్సార్ కడప జిల్లాలో నవంబర్ 5న నిర్వహించనున్న జెడ్పి టిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరు కూరి తెలిపారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామగ్రిని అన్ని పంపిణీ కేంద్రాల నుంచి నిర్దేశించిన మార్గాల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు భద్రంగా చేర్చినట్లు వెల్లడించారు. పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, రవాణా, భద్రత, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు తదితర అన్ని అంశాలను పూర్తి చేసి ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని 39 మండలాలకు గాను ఎన్నికల ప్రక్రియలో భాగంగా 21 మండలాల పరిధిలో 16 జెడ్పిటిసి, 55 ఎంపిటిసి స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. మొత్తం 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, జెడ్పిటిసి పరిధిలో 4,47,809 మంది, ఎంపిటిసి పరిధిలో 1,46,290 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముఖ్య వివరాలు జిల్లాలో మొత్తం మండలాలు: 39.. ఎన్నికలు జరిగే మండలాలు: 21.. జెడ్పిటిసి స్థానాలు: 16.. ఎంపిటిసి స్థానాలు: 55.. మొత్తం పోలింగ్ కేంద్రాలు: 599.. జెడ్పిటిసి ఓటర్లు: 4,47,809.. ఎంపిటిసి ఓటర్లు: 1,46,290.. జెడ్పిటిసి అభ్యర్థులు: 71.. ఎంపిటిసి అభ్యర్థులు: 171మొత్తం అభ్యర్థులు: 242

జిల్లాలో రెండో విడత గ్రామీణ స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనీ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన సవరించిన షెడ్యూల్ మేరకు నవంబర్ 5వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందనీ, ఏదైనా కారణంతో పునఃపోలింగ్ అవసరమైతే నవంబర్ 6వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అన్నారు. నవంబర్ 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందనీ, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల గణాంకాలు: అన్నమయ్య జిల్లాలో మొత్తం 3 రెవెన్యూ డివిజన్లు, 25 మండలాలు ఉన్నాయి. జిల్లాలో 25 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, 22 స్థానాలకు ఎన్నికలు, ఎంపీటీసీ స్థానాలు మొత్తం 321 కాగా, 147 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి అని అన్నారు. జిల్లావ్యాప్తంగా పురుషులు, మహిళలు, ఇతరులు కలిపి మొత్తం 828651 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారనీ అన్నారు. ఇందుకోసం 1002 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.ఎన్నికల పోలింగ్ విధుల నిర్వహణకు 1202 పీఓలు, 1202 మంది ఏపీవోలు, 4610 మంది ఓపిఓలు, 74 జోనల్ అధికారులు, 121 మంది రూట్ అధికారులు, 222 మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా: ఎన్నికలు నిష్పక్షపాతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పోలింగ్ ప్రాంతాలు, కేంద్రాలను వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లు చేపట్టాలనీ తెలిపారు. అతి సమస్యాత్మక 294 పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక 380 పోలింగ్ కేంద్రాలు మరియు సాధారణ 328 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇంటిలో మొత్తంగా 674 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 328 కేంద్రాలలో వీడియోగ్రఫీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రాలు: నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 1. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లి 2. యస్.జి ప్రభుత్వ డ్రీగ్రీ కళాశాల, పీలేరు 3. పాత యస్ పి బంగాళా, మసాపేట, రాయచోటి ఓటర్లందరూ తమ విలువైన ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల సజావుగా జరిగేలా చూడాలన్నారు.

## పరిషత్ ఎన్నికల్లో ఆ రెండు మండలాల్లో

# అన్నింటా పోటీ..!

### నందలూరు, పెద్దముడియంలో విజయం ఎవరిదో?

**రాజంపేట, నవంబర్ 4, ప్రభాతవార్త :**
నేడు జరిగే మండల పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఆ రెండు మండలాలు ప్రత్యేకత చాటుకున్నాయి. ప్రతి మండలంలో ఏకగ్రీవాల హోరు కనిపిం చిన ప్రస్తుత ఎన్నికల్లో ఈ రెండు మండలాల్లో మా త్రం ఏకగ్రీవం అనే మాటే వినపడలేదు. ఒక మండలం పెద్దముడియం కాగా మరొక మండలం నందలూరు. పెద్దముడియం మండలం మాజీ మంత్రి పి.రామ సుబ్బారెడ్డి ఆదిపత్యం చాటుకోవడం ఈ ఎన్నికల్లో అగ్నిపరీక్షగా మారింది. ఎందుకంటే స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమే. అయితే సొంత మండలంలో రామసుబ్బారెడ్డి 9 మంది ఎంపీటీసీ అభ్యర్థులను, ఒక జెడ్పిటిసి అభ్యర్థిని గెలిపించుకోవడం సవాలే అని చెప్పవచ్చు. ఎందు కంటే నియోజకవర్గంలో ఆధిపత్య రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యే ఆది ఈ మండలం పై కూడా ఆధిపత్యం సాధిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. ఇకపోతే నందలూరు మండలం వైసిపి రాజ్య సభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారింది. అయితే కూటమిలో ఉన్న విభేదాలు ఆ పార్టీకి శాపంగా మారాయి. వారే ఆధిపత్యం కోసం కొట్టుకుంటున్నారు. అందుకే ఏకగ్రీవం పక్కన పెడితే పోటీ వారి మధ్య జరిగే పరిస్థితి కనిపించింది. పది ఎంపిటిసి స్థానాలు, జడ్పిటిసి స్థానానికి జరుగు తున్న ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో సర్వత్ర నియోజకవర్గం లో చర్చగా మారింది. వైసిపి తర ఫున ఎంపి రఘునాథరెడ్డి అన్ని తానే చూసుకుంటుండగా కూటమి తరపున జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ ఎల్లటూరి శ్రీనివాసరాజు సొంత మరదల్ని ఎంపీపీ అభ్యర్థిగా బరిలోకి దించారు. మరోవైపు కూటమి తరపునే టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుపతికి చెందిన బాలసుబ్రమణ్యం కూడా ఆశిస్తున్నారు. తన ఇంటి నుంచి ఆయన ఎంపీపీ పదవి ఆశించి మహిళా అభ్యర్థిని రంగంలోకి దించారు. ఎంపీపీ పదవి జనసేనకు దక్కుతుందా తెలుగుదేశం పార్టీకి దక్కుతుందా అనేది పక్కన పెడితే ఈ మండలంలో మెజార్టీ స్థానాలు కూటమి గెల్చుకుంటుందా అన్నదే ప్రశ్న. వెన్నుపోటు రాజకీయాలు బహిరంగంగా కనిపిస్తున్నాయి. నామినేషన్ సందర్భంగా రాష్ట్రంలోనే నందలూరులో జరిగిన కాల్పులు పెద్ద చర్చకు దారితీసాయి. కూటమిలో విభేదాలు రచ్చకెక్కేలా చేశాయి. అయితే కూటమికి వైసిపి ఏ మేరకు గట్టి పోటీ ఇస్తుంది అనేది నేటితో తేలిపోనుంది. ఎందుకంటే గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ మేడా కుటుంబానిదే ఆదిపత్యం కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో ఆ ఆధిపత్యం కొనసాగుతుందా లేక కూటమికి దక్కుతుందా అనేది వేచి చూడాల్సిందే.

## ప్రజలకు జవాబుదారీతనంతో పని చేయాలి

### నూతన మున్సిపల్ పాలకవర్గానికి చమర్తి హితవు



కొత్తగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో జగన్మోహన్ రాజు, చైర్మన్ దొంతం శివ గాయత్రి

**రాజంపేట, నవంబర్4, ప్రభాతవార్త:**
గెలుపును తలకెక్కించుకోకుండా బాధ్యతతో పనిచేయండి. ప్రజలు అందించిన విజయాన్ని జవాబుదారిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు కోరారు. రాజంపేట మున్సిపాలిటీలో కూటమి తరపున ఎన్నికైన కౌన్సిలర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎలక్షన్ లో గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులందరినీ అభినందించి వారికి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కుమారి డాక్టర్ దొంతం గాయత్రిని చమర్తి జగన్ మోహన్ రాజు శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. అనంతరం చైర్‌పర్సన్ డాక్టర్ దొంతం గాయత్రి గారితో పాటు గెలుపొందిన 26 మంది కూటమి వార్డు కౌన్సిలర్లకు సీనియర్ నాయకుల సమక్షంలో చమర్తి జగన్ మోహన్ రాజు స్వయంగా అధికారిక డిక్లరేషన్ పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాల తర్వాత అటు గ్రామపంచాయతీ కానీ, ఇటు రాజంపేట పురపాలక పీఠం పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం గొప్ప విజయమని అన్నారు. అయితే ఈ గెలుపును ఎవరూ తలకెక్కించుకోకుండా మరింత బాధ్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ విజయం మన బాధ్యతను మరింత పెంచిందని, ప్రజాప్రతినిధులంతా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, పారిశుద్ధ మరియు ఇతర మౌలిక సమస్యలు ఎక్కడున్నా వెంటనే గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు కౌన్సిలర్లు స్వయంగా ముందుండి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండాలని, భవిష్యత్తును ఇచ్చిన తెలుగుదేశం పార్టీని నిరంతరం గుర్తుపెట్టుకుని రాబోయే ఏ ఎన్నికల్లోనైనా తెలుగుదేశం పార్టీదే విజయమయ్యేలా సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారి డాక్టర్ దొంతం గాయత్రి మాట్లాడుతూ తనపై అపార నమ్మకంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేతలకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుకి, పార్టీ సీనియర్ నేతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జగన్ మోహన్ రాజు గారి మార్గదర్శకత్వంలో వార్డు కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ రాజంపేట పట్టణ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ఈ విజయానికి అహర్నిశలు శ్రమించి సహకారం అందించిన కూటమి నేతలు, కార్యకర్తలు, రాజంపేట పట్టణ ప్రజలందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అభ్యర్థి, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జులు కొల్లి రెడ్డయ్య, షేక్ కరీం, సీనియర్ నాయకులు డాక్టర్ సుధాకర్, లక్ష్మీనారాయణ, సంజీవ్ నాయుడు, గుగ్గిళ్ళ చంద్రమౌళి, డాక్టర్ నవీన్, మనుబోలు వెంకటేశ్వర్లు,తుపాకుల అశోక్, రామ్ నగర్ నరసింహ, సమీర్ భాష,చిన్నా,ఎన్నికైన 26 మంది కూటమి కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మదనపల్లిలో జడ్పిటిసి ఎంపిటిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

**మదనపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త:**
నేడు జరిగే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అనంతరం,మదనపల్లి ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, తంబళ్లపల్లి, పెద్దమండెం, మొలకలచెరువు, పిటిఎం, బి.కొత్తకోట, కురబలకోట, పుంగనూరు, చౌడేపల్లి మండలాలకు సంబంధించి ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం సాయంత్రం సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అధికారులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ అనంతరం వచ్చిన బ్యాలెట్ బాక్సు, మెటీరియల్ స్వీకరణ, స్ట్రాంగ్ రూములో బ్యాలెట్ బాక్స్ లు భద్రపరచడం, కౌంటింగ్ ఏర్పాట్లు, తదితరాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. మదనపల్లి మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజక వర్గాలకు సంబంధించి 507 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే బ్యాలెట్ బాక్సులను స్వీకరించేందుకు మండలాల వారీగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల నిర్వహణ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తీసుకొచ్చే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, బ్యాలెట్ బాక్సులను స్వీకరించి నిర్దేశిత స్ట్రాంగ్ రూములకు తరలించే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు, నిర్దేశిత విధానాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘాతో పాటు పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కూడా జేసి పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, బ్యాలెట్ బాక్సుల తరలింపు, కౌంటింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల పారదర్శకత, నిష్పక్షపాత నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మీపతి, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయశేఖర్, సర్వే శాఖ ఏడి శాంత రాజ్, శ్రీనివాసులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలను వందశాతం సాధించాలి

### జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. రవి బాబు

**కడప, నవంబర్ 4, ప్రభాతవార్త:**
జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. రవి బాబు, ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ అన్నారు.బుధవారం దిశ ఆధ్వర్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ గారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా కమ్యూనిటీ రిసోర్స్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ సిబ్బంది, ఎల్‌డబ్ల్యూఎస్, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్ఐవీ పరీక్షల శిబిరాలను నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ..మిగతా 2పేజీలో

## జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

### పులివెందుల మండలంలో 15 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

### 10,782 మంది ఓటర్లు.. మహిళా ఓటర్లే అధికం

### బరిలో టీడీపీ అభ్యర్థి భారతి, వైసీపీ అభ్యర్థి సావిత్రి

ఎన్నికల విధులకు సంతకాలు చేసి వెళ్తున్న పోలింగ్ అధికారులు

**పులివెందుల, నవంబర్ 4, ప్రభాతవార్త:**
పులివెందుల మండల పరిధిలో గురువారం జరిగే జడ్పీటీసీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 15 పోలింగ్ కేంద్రాలను సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.మండల పరిధిలోని అచ్చవెల్లి రెండు , రాగిమానుపల్లె ఒకటి, ఎర్రబల్లి తాండ ఒకటి , కన్నంపల్లి 2, మోట్నూతల పల్లి ఒకటి ఈ.కొత్తపల్లె రెండు, ఎర్రబెల్లి రెండు , నల్లపరెడ్డిపల్లె 3 నల్లొండవారిపల్లె ఒకటి మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మండల పరిధిలో మొత్తం 10,782 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 5,170 మంది పురుషులు, 5,612 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్య 442 అధికంగా ఉండటం విశేషం.పులివెందుల జడ్పీటీసీ స్థానానికి కూటమి తరపున బొంగాని భారతి, వైసీపీ తరపున మోపూరు సావిత్రి పోటీలో ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఓటరు స్వచ్ఛందంగా పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య హక్కు అయిన ఓటు హక్కును వినియోగిం చుకోవాలని పులివెందుల పట్టణ సీఐ పురుషోత్తం రాజు కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# బాబురావుకు స్వర్ణ పతకం

### 457.5 కేజీల బరువు ఎత్తి ప్రతిభ చాటిన అకడమిక్ డీన్

**వేంపల్లె, నవంబర్ 04, ప్రభాతవార్త:**
స్థానిక పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్ అకడమిక్ డీన్ బాబు రావు దక్షిణ భారత స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి పాఠశాలకు, ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. కేరళ రాష్ట్రం కన్నూర్‌లో నవంబర్ 1న నిర్వహించిన పోటీల్లో అండర్-59 కేజీల ఓపెన్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసు కున్నారు. ఈ పోటీల్లో స్క్వాట్‌లో 182.5 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 82.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 192.5 కేజీలు ఎత్తి మొత్తం 457.5 కేజీలతో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. కేశవులు మాట్లాడు తూ ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వహిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. డైరెక్టర్ పి. చంద్రబాబు మాట్లా డుతూ బాబు రావు విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ తనకు మార్గదర్శకత్వం అందించిన కడప జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బాలగోవింద్ తివారీకి, ప్రోత్సాహం అందించిన పాఠశాల కరస్పాండెంట్ పి. కేశవులు, డైరెక్టర్ పి. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## మధ్యవర్తిత్వం పై అవగాహన సదస్సు

కడప లీగల్, నవంబర్ 4, ప్రభాతవార్త :

పులివెందులలోని తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామ్ గోపాల్ ఆదేశాల మేరకు సెక్రటరీకం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో వారి గ్రామాలలో ఉండే వక్తులను కమ్యూనిటీ మీడియేటర్స్‌ను నియమించడము జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తలెత్తే చిన్న చిన్న వివాదాలు, కుటుంబ సమస్యలు, భూ సంబంధిత వివాదాలు, ఆస్తి తగాదాలు మరియు ఇతర సామాజిక సమస్యలను పరస్పర చర్చలు, అవగాహన, సయోధ్య ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని వివరించడం జరిగింది. కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులకు వెళ్లకుండానే స్థానిక స్థాయిలోనే వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని, దీని వల్ల సమయం, డబ్బు ఆదా కావడమే కాకుండా ప్రజల మధ్య స్నేహపూర్వక సంబం ధాలు, సామాజిక ఐక్యత పెంపొందుతాయన్నారు. శిక్షణ పొందిన కమ్యూనిటీ మధ్యవర్తులు టి. గంగాధర్ రెడ్డి బి. బయలు రెడ్డి ఎస్. త్యాగ రాజులకు సర్టి ఫికెట్స్‌ను సెక్రటరీకం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్ . బాబా ఫక్రుద్దీన్, కం జూనియర్ సివిల్ జడ్జి, పులివెందుల ఎం. చంద్రశేఖర్ రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, అరుణ కుమారి శిక్షణ పొందిన మధ్య వర్తులు పి. ప్రభావతి ఎ. బాల సుబ్బయ్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రకాంతమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంతో వ్యక్తిపై ఇటుకలతో దాడి

మదనపల్లె క్రైమ్ నవంబర్ 4 ప్రభాతవార్త

భూ సమస్యల వివాదంలో ఓ వ్యక్తిపై ప్రత్యర్థులు ఇటుకలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సం ఘటన ముదివేడు పంచాయతీ సద్దికూటివారిపల్లెలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకా రం సద్దికూటివారిపల్లె గ్రామానికి చెందిన ఎస్. శ్రీనివాసులు కుమారుడు ఎస్. దామోదర్ (30) తమకు చెందిన స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్ని స్తున్నారన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఎస్. వేణు, సుధాకర్లు సదరు భూమి తమదేనంటూ అడ్డుపడటంతో పాటు కోర్టులో కేసు వేశారని ఆరోపిం చారు. ఈ విషయంపై మాట్లాడేందుకు తాము వారి వద్దకు వెళ్లగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేణు, సుధాకర్లు ఇటుకలతో దాడికి పాల్పడ్డారన్నారు. ఈ ఘట నలో తీవ్రంగా గాయపడిన దామోదర్‌ను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్సై మధు రామచంద్రుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రాదేశిక ఎన్నికలకు సర్వం సిద్ధం

చౌడేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త:

ఈనెల 5న జరగబోయే జిల్లా ప్రాదేశిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల రిటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్ పెళ్లై ఎంపీడీవో లీలా మాధవిలు అన్నారు మండల వ్యాప్తంగా 19 గ్రామ పచాయతీలు ఉండగా 46 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేశామన్నారు దిగువపల్లి కాకతి గడ్డం వారి పల్లి పంచాయతీ గ్రామాలలో నూత నంగా మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు ఓటర్ల సంఖ్యను బట్టి ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు పోలింగ్ కే ంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు ముఖ్యంగా మంచినీటి వసతి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు అంతేకాకుండా మొబైల్ ఫోన్లు ఎవరు పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్ళరాదు అన్నారు వారి కోసం ఆయా కేంద్రాల వద్ద హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామన్నారు ప్రజలు రాజ కీయ నాయకులు ఎన్నికల నియమాలని ఉల్లంఘించకుండా ప్రశాంత వాతా వరణంలో జరిగేలా సహకరించాలని వారు కోరారు అనంతరం ఆయా కేంద్రా లకు ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసి అధికారులకు రవాణా సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటు వేయండి: ఎస్ఐ హృషికేశవరెడ్డి

రామసముద్రం, నవంబర్ 4 ప్రభాతవార్త:

రామసముద్రం మండలంలో గురువారం జరిగే ఎంపీటీసీ, జెడ్పీ టీసీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ హృషికేశవ రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్ కార్యాలయంలో మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని, మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని తెలి పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరి స్తున్నానని, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని, అత్యవసర సమాచారం కోసం స్థానిక పోలీస్ లేదా టోల్ ఫ్రీ 100/112కు కాల్ చేయాలన్నారు.

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

పీలేరు, నవంబర్ 4, ప్రభాతవార్త:

మండలంలో గురువారం జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్ ఓ శ్రీని వాసులునాయుడు తెలిపారు. బుధవా రం స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళా శాల నుంచి ఎన్నికల సామాగ్రిని సిబ్బంది తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయతీల్లో మొత్తం 73 పోలింగ్ కేంద్రా లు, 63.157 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 30,588 పురుషులు, 32,559 మహిళలు, 10 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. 1,038 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## వధూవరులకు తాళిబొట్టు అందజేసిన చిన్నపురెడ్డి

సిద్ధవటం, నవంబర్ 3, ప్రభాతవార్త:

రాజంపేట ఇంచార్జి జగన్ మో హన్ రాజు ఆధ్వర్యంలో టక్కోలి హరిజనవాడకు చెందిన వధూవ రు లు వెంకటేశ్, లక్ష్మీదేవి వివాహానికి సంబంధించిన శుభలేఖను అందజేసి ఆశీర్వాదాలు తీసుకునేందుకు చిన్న పురెడ్డి నివా సానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్నపురెడ్డి వధూవరుల కోసం పసుపు, కుంకుమ, తాళిబొట్టును బహూకరించారు. ఈ కార్యక్రమం లొ పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి, చిన్నపరెడ్డి, తిరుపతి, సుబ్బ మ్మ, ఎల్లయ్య, టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ అండర్14 క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాటర్ల విధ్వంసం

### భారీ స్కోర్లు.. సెంచరీలతో చెలరేగిన యువ క్రికెటర్లు

పీలేరు, వాల్మీకిపురం, నవంబర్ 4, ప్రభాతవార్త:

ఏసీఏ, సీడీసీఏ ఆధ్వర్యంలో వాల్మీకిపురంలోని జి.వి.ఎస్.సి.ఎస్., సీడీసీఏ క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్న సౌత్ జోన్ అండర్14 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం రెండో రౌండ్ మ్యాచ్‌లు ప్రారం భమయ్యాయి. రెండు మైదానాల్లో జరిగిన మ్యాచ్‌లలో నెల్లూరు, కడప జట్ల బ్యాటర్లు అద్భుత ప్రతిభ కనబరిచి భారీ స్కోర్లు నమోదు చేశారు.

**గ్రౌండ్1లో నెల్లూరు 403 పరుగులు**

నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు బ్యాటర్ కె. కిషల్ కేవలం 54 బంతుల్లో 99 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఎస్.కె. సమీర్ 161 బంతుల్లో 82 పరుగులు, మహీధర్ 136 బంతుల్లో 89 పరు గులు, అథర్వ్ సావంత్ 65 బంతుల్లో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జ ట్టు భారీ స్కోరుకు తోడ్పడ్డారు. దీంతో నెల్లూరు జట్టు 90 ఓవర్లలో 9 వికె ట్లు కోల్పోయి 403 పరుగులు సాధించింది.కర్నూలు బౌలర్లలో సి. యోగేష్ సాయి మూడు వికెట్లు పడగొట్టగా, ఎల్. తనుష్ సాయి, షేక్ ఖలీద్ రెండేసి వికెట్లు, పి. వరుణ్ కుమార్, యశ్వంత్ సూర్యతేజ ఒక్కో వికెట్ సాధించారు.

**గ్రౌండ్2లో కడప జట్టు 416 పరుగులు**

కడప, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. కడప బ్యాటర్ ఎస్. భాను వర్షిత్ రెడ్డి 173 బంతుల్లో 146 పరుగులతో అద్భుత సెంచరీ సాధించగా, విష్ణువర్ధన్ రెడ్డి 147 బంతుల్లో 98 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జి. మానస్ నందన్ 106 బంతుల్లో 55 పరుగులు, సి. రిత్విక్ 49 బంతుల్లో 55 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో కడప జట్టు 90 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 416 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.కడప బ్యాటర్ భాను వర్షిత్ రెడ్డి వరుసగా రెండు మ్యాచ్‌లలో సెంచరీలు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. చిత్తూరు బౌలర్లలో కె. ఆశ్రిత్ రెడ్డి మూడు వికెట్లు తీయగా, పర్వీత్, లిఖిత్ ఇరగం రెడ్డి ఒక్కో వికెట్ పడగొట్టారు.

**పర్యవేక్షించిన క్రికెట్ ప్రముఖులు**

ఈ మ్యాచ్‌లను సీడీసీఏ వైస్ ప్రెసిడెంట్, జి.వి.ఎస్.సి.ఎస్. వ్యవస్థా పకుడు శ్రీధర్ కుమార్, ఏసీఏ రాష్ట్ర పరిశీలకులు రవిచలం, విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర సెలక్షన్ కమిటీ సభ్యుడు జగదీష్, జోన్ సెలక్షన్ కమిటీ సభ్యులు జవ హర్ భాష, మహమ్మద్, గ్రౌండ్ ఇన్‌చార్జి భరత్ కుమార్ పర్యవేక్షించారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ హెడ్ కోచ్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

## సిద్ధవటం మండలంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

### రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య

సిద్ధవటం, నవంబర్, 3 ప్రభాతవార్త:

మండలంలోని, పొన్నపోలు, కొత్తపల్లి టక్కోలి ఎంపీటీసీ స్థానాలకు గురు వారం ఎన్ని కలు జరగనున్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు ఈ సందర్భంగా బుధవారం సిద్ధ వటం లోని, ఎంపీడీవో సభా భవనంలో ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ స్థా నాల ఎన్నికలకు విధులకు హాజరైన అధికారులను ఒక్కొక్క పోలింగ్ కేంద్రా నికి ఐదు మందిని ఏర్పాటు చేశామని రెండు ఎంపీటీసీ స్థానాన్ని కలిపి 8 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 40 మందిని ఏర్పాటు చేశామన్నారు వీరికి మూడవసారి పోలింగ్ ప్రక్రియ పై శిక్షణ ఇచ్చి వారికి పోలింగ్ సామాగ్రిని అందజేశామన్నారు ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి కస్సర్ట్ రూట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందిని పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించామన్నారు, గురువారం జరిగే ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ అధికారులు ఏర్పాటు చేసుకుంటానున్నారు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు పోలింగ్ జరగక ముందే ఇరు పార్టీలకు సంబంధించి ఏజెంట్ల సంతకాలు తీసుకొని వారికి ఖాళీ బ్యాలె ట్ బాక్స్‌ను చూపించి వారి ఎదురుగానే బాక్సులకు సీల్ చేస్తామని అనం తరం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందన్నారు ఎన్నికలు ముగిసిన అనంతరం పోలింగ్ బాక్సులను సీజ్ చేసి కడపలోని స్ట్రాంగ్ రూమ్ తరలిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి తాసిల్దార్ విజయకుమార్ ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు ఎంపీటీసీ ఎన్నికలకు దృష్టిలో పెట్టుకొని డిఎస్పి వెంకట్రామయ్య సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు రెండు ఎంపీటీసీ స్థానాలకు జరగబోవు ఎన్నికలకులకు 40 మంది పోలీసులతో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల వరకు పరిసర ప్రాంతాలలో ఎవరు ఉండకూడదని ఓటు వేసుకున్న వ్యక్తులు వెంటనే ఇంటికి వెళ్లి పోవాలని గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హారిక తెలిపారు.

## హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్

మదనపల్లె క్రైం, నవంబరు 4 ప్రభాతవార్త.

హత్యాయత్నం కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తాలూకా సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె కు చెందిన ప్రశాంత్ కుమార్తె నిత్య పట్ల బీకేపల్లెకు చెందిన రాజేష్ అసభ్య కరంగా ప్రవర్తించాడని ఆమె కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ప్రశాంత్, అతని కుటుంబ సభ్యులు ప్రదీప్, రత్నమ్మ, లోకేష్ పై హత్యా యత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామన్నారు. అలాగే తీవ్రంగా గాయపడి అపస్మార కస్థితిలో ఉన్న రాజేష్ తిరుపతి రుయాలో కోలుకుంటున్నట్లు సీఐ తెలిపారు.

## అందాన్ని లాక్‌చేద్దాం..

**స్కిన్‌కేర్.. ప్రస్తుతం చాలామంది అమ్మాయిల రొటీన్‌లో ఇది భాగం. ఈ క్రమంలో అనేక రకాల క్రీములు వాడుతుంటాం కదా! అయితే, ప్రస్తుతం నడుస్తోంది మాత్రం గ్లూటాథయోన్ ఉత్పత్తుల ట్రెండే..**

చర్మాన్ని కాంతిమంతంగా చేయడంలో ఇదే కీలకం మరి.. శరీరం సహజంగా ఉత్పత్తిచేసే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ గ్లూటాథయోన్. ఇందులోని అమైనో ఆమ్లాలు, శరీరానికి హానిచేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను తటస్థపరిచి, వృద్ధాప్య ఛాయలు రాకుండా చూస్తాయి. అంతేకాదు, చర్మానికి మంచి ఛాయ వచ్చేలానూ చేస్తాయి.

**ట్యాన్ తగ్గించి...** ఎన్ని సంరక్షణ పద్ధతులు పాటించినా సూర్యరశ్మి దాడి నుంచి తప్పించుకోవడం కష్టమే కదా! కాసేపు ఎండలో ఉన్నా సరే అతినీల లోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీసి, ట్యాన్ ఏర్పరుస్తాయి. ఇలాంటప్పుడు గ్లూటాథయోన్ ఉండే క్రీముల్ని మనం ఎంపిక చేసుకుంటే, శరీరంలో టాక్సిన్లను తొలగించి, క్లియర్ చర్మాన్ని అందిస్తుంది. చర్మంపై రక్షణ కవచంలా ఏర్పడి యూవీ కిరణాల నుంచి రక్షిస్తుంది.

**రిపేర్ చేసి...** వయసుపైబడే కొద్దీ చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. అప్పుడూ మనకు ఉపయోగపడే మ్యాజిక్ క్రీమ్ ఇదే. ఎందుకంటే చర్మం ఎలాస్టిసిటీని కాపాడడంలో కొలాజెన్ పాత్ర కీలకం. శరీరంలో కొలాజెన్ తయారీకి గ్లూటాథయోన్ తోడ్పడుతుంది

## శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయానికి రూ.20,116 విరాళం

### మాజీ జెడ్పీటీసీ రాచపూడి నాగభూషణం జయంతి సందర్భంగా విరాళం అందజేసిన డాక్టర్ దిలీప్ గుప్తా కుటుంబ సభ్యులు

బద్వేల్ అర్బన్, నవంబర్ 04 ప్రభాతవార్త :

బద్వేల్ పట్టణంలోని గౌరీ శంకర్ నగర్‌లో వెలశియున్న శ్రీ రమాదేవి సహిత సత్య నారాయణ స్వామి దేవాలయానికి రూ. 20, 116 నగదు విరాళాన్ని అందజేశారు.మాజీ జెడ్పీటీసీ స్వర్గీయ రాచపూడి నాగభూషణం జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం, వారి కుమారుడు రాచపూడి నాగ భూషణం కళ్యాణ మండపం యజమాని డాక్టర్ రాచ పూడి దిలీప్ గుప్తా, సతీమణి హైమావతి మరియు వారి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందజేయడం జరిగింది. బుధవారం ఆంజనేయ నగర్‌లోని దిలీప్ గుప్తా స్వగృహంలో వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణశర్మ, క్రిష్టిపాటి లక్ష్మీనారా యణ శాస్త్రికి ఈ నగదును అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రాచపూడి దిలీప్ గుప్తా మాట్లాడుతూ, తమ తండ్రిగారి సేవలను స్మరించుకుంటూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేశామని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు దాతల సేవలను కొనియాడారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

గోపవరం. నవంబర్ 4. ప్రభాతవార్త.

గోపవరం మండలంలో 5న బ్రాహ్మణపల్లి, కాలవ పల్లి జరగనున్న జెడ్పీటీసీ, ఎం పీటీసీ ఎన్నికల నేప థ్యంలో గోపవరం గురుకుల పాఠశాల నందు ఏర్పాటు చేసిన ఎన్నికల సంబంధిత ఏర్పాట్లను బద్వేలు ఆర్డీవో ఎ. చంద్ర మోహన్, డీఎల్‌డీఓ, బద్వేలు ఎంపీడీఓ మరియు బద్వే లు తహసీల్దార్ తిరుమల బాబుతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సం దర్భంగా స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్ మరియు రిసెప్షన్ హాల్‌లను పరిశీలించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సమీక్షిం చడం జరిగింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది.

## ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలను వందశాతం సాధించాలి

మొదటి పేజీ తరువాయి

కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.మొబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష (మాస్) కార్యక్రమంలో భాగంగా మొదటి 95, రెండవ 95, మూడవ 95 లక్ష్యాలను సాధిం చాలన్నారు. సోప్ పోర్టల్‌లో కేసులను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఐటీఎస్ ప్లస్, ఇండెక్స్ కేసులపై ప్రత్యేక దృష్టి సాదించాల న్నారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తులను ఏఆర్టీ కేంద్రాల్లో నమోదు చేయించి, అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల సేవలు అందుబాటు లో ఉండేలా చూడాలని, ముఖ్యంగా హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, మం దుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ప్రతి గర్భిణీ స్త్రీకి తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సూపర్వైజర్ ప్రసాద్, ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ సిబ్బంది, ఎల్‌డబ్ల్యూఎస్, ఎన్‌జీవో ప్రతినిధులు, సీఎస్ఎస్ ఆఫీసర్ గంగాభవాని, ఎన్‌జీవో పీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రాజకీయ హక్కులపై రాజీ పడే ప్రసక్తే లేదు : వైసీపీ బిసి నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త

బీసీలకు దక్కాల్సిన ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవిని ఓసీలకు కేటాయించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి లేఖ రాశారన్న వివాదంపై బహిరంగంగా నిజానిజాలు నిగ్గు తేల్చాలని వైసీపీ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. సంబంధిత లేఖను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపితే వాస్తవాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. బుధవారం దొరసాని పల్లెలోని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నివాసంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లేఖ ఫోర్జరీదంటూ టీడీపీ నాయకులు చేస్తున్న వాదనలను వారు ప్రశ్నించారు. లేఖ నిజమైనదని తేలితే కూటమి బీసీ నాయకులు బాధ్యత వహించాలని, ఫోర్జరీ అని నిర్ధారణ అయితే తాము వైసీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. బీసీల హక్కుల విషయంలో పార్టీలకు మద్దతుగా కాకుండా సామాజిక ప్రయోజనాల కోసం నాయకులు స్పందించాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి భర్త మాట్లాడుతూ తన భార్య ఐదేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగడానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సహకరించారని తెలిపా రు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల సమయంలోనూ, కుమారుడి వివాహం సంద ర్భంగా ఆయన అండగా నిలిచారని గుర్తుచేశారు. సాధారణ టైలర్ కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పదవి కల్పించిన ఘనత రాచమల్లుదేనని పేర్కొన్నారు. ఆయన తమ కుటుంబ సభ్యుడితో సమానమని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు రాజకీయ పదవులతో పాటు విద్య, వైద్య రంగాల్లో ప్రాధాన్యత కల్పించారని నాయకులు పేర్కొన్నారు. నేతన్న నేస్తం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, నాడునేడు, వైద్య కళాశాలల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. బీసీలు తమ హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, పిట్టా భద్రమ్మ, మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, నాయకులు భీమునిపల్లె నాగరాజు, బండారు సూర్యనారాయణ, యాలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం నిర్భయంగా ఓటేయండి : సీఐ వెంకటేశ్వర్లు

చౌడేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త:

ఈనెల 5న జరగబోయే జిల్లా ప్రాదేశిక ఎన్నికలలో ఎవ రు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల ని పుంగనూరు రూరల్ సీఐ వెం కటేశ్వర్లు పిలుపునిచ్చారు ఈ మేరకు ఆయన స్థానిక ఉన్నత పాఠశాల ఆవర ణలో పోలీసులకు ఎన్నికల నియమావళి పై అవగాహన కల్పించారు అనంతరం పట్టణంలో పోలీసు కవాతు ఏర్పాటు చేశారు మండలంలోని అతి సున్నిత సున్నిత ప్రాంతాలలో పోలీసు బందోబస్తును కఠిన తరం చేసామన్నారు తగ్గిన కేంద్రాలలోనూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు మం డల వ్యాప్తంగా 6 మొబైల్ వాహనాలు ఉంటాయని 70 మంది సివిల్ పోలీ సులు అదేవిధంగా డి.ఎస్.పి ఎస్పీ స్థాయి రిజర్వ్ పోలీసులు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పిలుపుమేరకు ఎవరైనా నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు అనుమానితులుగా కని పించిన పోలింగ్ కేంద్రాలలోకి చొరబడి వెళ్లిన వారిపై కఠినంగా వ్యవహ రిస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఓటర్లు ఎలాంటి భయాందోళనలు చెందకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్ర మంలో ఎస్సైలు చిన్న రెడ్డప్ప నాగేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పిటిసి ఎంపీటీసీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

### పోలింగ్ కేంద్రాలకు సామాగ్రి తో తరలి వెళ్లిన ఎన్నికల సిబ్బంది ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో శ్రీనివాస్

సంబేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త:

సంబేపల్లి మండలంలో గురువారం జరగనున్న జడ్పి టిసి ఎంపిటిసి పోలింగ్‌కు ఎ న్నికల అధికారులు సర్వం ని ర్వహించడం జరిగింది. బుధవారం సంబే పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బంది తో మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి హైమావతి అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శివకుమార్ రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి పోలింగ్ సిబ్బందికి సూచనలు సలహాలను ఇచ్చారు ఈ సందర్భంగా రాయచోటి ఆర్డిఒ శ్రీనివాస్ ఎన్నికల పోలింగ్ సంద ర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు సంబేపల్లి మండలంలో 42 పోలింగ్ కేంద్రా లు ఏర్పాటు చేశారు ఒక్కక పోలింగ్ కేంద్రాల్లో పిఓపిఓ ఏ సిబ్బందితో కలిసి ఆరు మందితో కలిసి 250 మంది ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మండలంలో మూడు జోన్లు ఆరు రూ ట్లో ఏర్పాటు చేసి ముగ్గురు జోన్ అధికారులో 6 మంది రూట్ అధికారులు గురువారం ఎన్నికల ప్రక్రియ సరళని పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాంతియుత వాతావరణం మధ్య ప్రశాంత ఎన్నికలను జరిపేందు

# సుస్థిరమైన ఆరోగ్యకరమైన ఆహారం మన హక్కు

**పీలేరు నవంబర్ 4 ప్రభాతవార్త:**

పీలేరు డివిజన్ పరిధిలోని సదుంలో సుస్థిరమైన ఆరోగ్యకరమైన ఆహారం మన హక్కు అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. బ్రిక్స్ సుస్థిర ఆరోగ్య జీవనశైలి వారోత్సవాలలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు సదుం మండలం చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో కలకటవారిపల్లి గ్రామంలో మరియు సదుము 1 నందు బ్రిక్స్ ఆరోగ్యకర సుస్థిర జీవనశైలి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైన తల్లులు, గర్భవతులు బాలింతలు, కిషోర్ బాలికలు ప్రజలను ఉద్దేశించి మహమ్మద్ రఫీ డిప్యూటీ హెచ్.ఈ.ఓ. మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మరియు సుస్థిరమైన ఆహార పలవాట్లను అలవర్చుకోవడం వల్ల శాశ్వతమైన సుస్థిరమైన ఆరోగ్యము పొందడమే కాకుండా ఆయుష్షును పెంచుకోవడం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడము, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయి అని తెలిపారు. మన దైనందిన జీవితంలో పోషక విలువలు కలిగిన స్థానికంగా లభించే మరియు కాలానుగున ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ప్రతిరోజు సమతుల పౌష్టికాహారం తీసుకోవడం ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాలు, తృణధాన్యాలు మరియు పప్పు ధాన్యాలను ఆహారంలో రోజువారి చేర్చుకోవాలి అన్నారు. అధిక ఉప్పు, చక్కెర మరియు కొవ్వు పదార్థాలను వీలైనంతవరకు బాగా తగ్గించాలని రోజుకు తగినంత సురక్షితమైన మంచినీటిని తాగాలని జంక్ ఫుడ్స్,ప్యాకేజ్డ్ ఫుడ్స్ మరియు శీతల పాలే పానీయాలను బాగా తగ్గించాలని తెలిపారు. స్థానికంగా పండించిన మరియు కాలానుగుణంగా లభించే ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవడం వల్ల డబ్బులు ఆదా చేయడంతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. సుస్థిరమైన ఆహారపు అలవాట్లు ప్రయోజనాలలో పోషకాహార లోపాలను తగ్గించవచ్చు మరియు ఊబకాయం షుగర్ మరియు గుండె సంబంధితల వ్యాధులను ప్రమాదాన్ని తగ్గించవచ్చు మరియు రైతులకు స్థానిక ఆహార ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా అనవసరంగా ఆహార వృధాను తగ్గించుకోవచ్చని తెలిపారు.ప్రకృతి వనరులను సంరక్షించుకోవచ్చు మరియు పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతీ రోజూ సగటున మనిషి ఐదు గ్రాముల ఉప్పు తీసుకోవాలని తెలిపారు. అనంతరము ప్రజల చేత సుస్థిరమైన ఆరోగ్య ఆహారపు అలవాట్లు పర్యావరణ పరిరక్షణ పై ప్రతిజ్ఞ చేయించి నినాదాలు చేయించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ మరియు ఆరోగ్య సిబ్బంది హేమలత సరస్వతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేసన్న దృశ్యం

## జడ్పీటీసీ ఎన్నికలకు పోలీసుల పటిష్ట బందోబస్తు

**పీలేరు కె.వి పల్లి నవంబర్ 4 ప్రభాతవార్త:**

కె.వి.పల్లి మండలంలో జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ బి. వెంకట శివకుమార్ ఎన్నికల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి విధుల పాస్‌లు అందజేశారు.

## ఇది దివ్య ఔషధం

వేడికి విరుగుడు అనగానే ముందుగా గుర్తొచ్చేది కొబ్బరి నీళ్లు. అంతేనా నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, వికారం, వేడిచేయడం, అరికాళ్ల మంటలు. . ఇలా ఎన్నిటికో దివ్య ఔషధం కొబ్బరిబొండం. కొబ్బరి నీళ్లలో ప్రొటీన్లు, పీచు, చక్కెర, కాల్షియం, పొటాసియం, మెగ్నీసియం, సోడియం, భాస్వరం ఉన్నందున శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల వెంటనే శక్తి వస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మూత్రపిండాల్లో ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. రాళ్లు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. కొబ్బరి నీళ్ల ఉండే ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కండరాల పనితీరు మెరుగవు

# పంచ వ్యవస్థల తీరుతోనే ప్రజాస్వామ్యం అపహస్యం

### ఐదు ప్రభుత్వ వ్యవస్థలపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ధ్వజం

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలలో ఐదు ప్రభుత్వ వ్యవస్థల తీరుతోనే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైయిందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి భుజమిద్దరం. బుధవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల స్వేచ్ఛాయుత ఓటు హక్కుకు అవకాశం లేకుండా చేసి, అధికార బలంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు గెలుపొందారని విమర్శించారు. ప్రజలు ఆదరించి గెలిపించినప్పుడు మాత్రమే విజయోత్సవాలకు అర్థం ఉంటుందని, అడ్డదారుల్లో సాధించిన విజయాలను ప్రజాస్వామ్య విజయాలుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం, స్థానిక ఎమ్మెల్యే, పోలీసు వ్యవస్థ, అధికార యంత్రాంగం కీలక పాత్ర పోషించాయని రాచమల్లు ఆరోపించారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవం కలుగుతుందని, వైఎస్సార్‌సీపీ ఆ దిశగా పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ఐదేళ్లపాటు పదవుల్లో కొనసాగాల్సి ఉండగా, ప్రస్తుత ఎన్నికల్లో గెలిచిన వారి పదవులు 2029 జూన్ వరకే ఉంటాయని, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేయిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సి.ఎస్. ఖాజామోహిద్దీన్, మాజీ కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, పిట్టా భద్రమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సభ్యుడు మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, నాయకులు భీముని పల్లె నాగరాజు, బండారు సూర్యనారాయణ, యాలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహణకు సహకరించండి

**తంబళ్లపల్లె నవంబర్ 4 ప్రభాతవార్త ఃఃః

# జడ్పిటిసి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**మైదుకూరు, నవంబర్ 04, ప్రభాతవార్త:**

మైదుకూరు మండల పరిధిలో గురువారం జరగనున్న జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయని ఆర్ ఓ చింతామణి తెలిపారు. బుధవారం మైదుకూరు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో పిఓ, ఏపిఓ ఇతర సిబ్బందికి ఎన్నికలకు సంబంధించిన అవగాహన కల్పించారు. ఎన్నికలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. పోలింగ్ బాక్సులు, ఇతర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 32 పోలింగ్ బూతులను ఎన్నికల కోసం సిద్ధం చేయించామన్నారు. 27, 488 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి 160 మంది సిబ్బందిని నియమించి 5 రూట్లలో, రెండు జోన్లుగా పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. ఇలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని రకాల వసతులు కల్పించామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను అసిస్టెంట్ ఆర్ ఓ లు శ్రీధర్ నాయుడు, రాజసింహ నరేంద్ర, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## బిఎల్ఓలకు తహసిల్దార్ ఆదేశాలు

**పీలేరు నవంబర్ 4 ప్రభాతవార్త :**

మండలంలో జరుగుతున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలను సజావుగా నిర్వహించాలని బిఎల్ఓ లకు తహసిల్దార్ శివకుమార్ ఎన్నికల విధుల గురించి తెలియజేశారు పోలింగ్ స్టేషన్ వద్ద బిఎల్ వాళ్లు హాజరై ఓటర్లను నిర్వహణ పై సూచనలు ప్రతి బి ఎల్ ఓ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ వద్ద ఉదయం 6 గంటలకు హాజరవాలన్నారు పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్ల రద్దీని నియంత్రింపుతూ క్యూ లైన్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా సహాయ చర్యలు చేపట్టాలి పోలీస్ స్టేషన్ వద్ద క్రమశిక్షణ సమయపాలన పాటించాలి. ఉన్నతాధికారుల నుండి జారీ చేయబడిన సూచనలు ఆదేశాలను తప్పక పాటించాలి.

### ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా

## పారదర్శకంగా నిర్వహించాలి

**సుండుపల్లి, నవంబర్ 04,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో సుండుపల్లె ప్రభుత్వ హైస్కూల్‌లో పోలింగ్ సిబ్బందితో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు.పోలింగ్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో సుండుపల్లె ప్రభుత్వ హైస్కూల్‌లో పోలింగ్ సిబ్బందితో సమావేశం ఐన ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

### సుస్థిరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

**వేంపల్లె నవంబర్ 04 ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ సుస్థిరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వసిడిఎస్ సూపర్వైజర్ డా.స్వర్ణలత వెల్లడించారు. బుధవారం స్థానిక కాపువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించు కోవడం, విద్యుత్ ఆదా చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించు కోవడం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోషకాహారం, ఆహార వృధాను అరికట్టడం, ఆరోగ్యకర జీవన విధానం అలవర్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీ, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం

### పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసిన పోలీసులు

**నిమ్మనపల్లి నవంబర్ 4 ప్రభాతవార్త**

మండలంలో నేడు గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఆర్ఓ డా.రోహిణి తెలిపారు. బుధవారం ఎన్నికల సిబ్బంది పిఓ, ఏపీఓ, ఓపిఓ లకు ఎన్నికలకు అవసరమైన సామాగ్రిని అందజేశారు. అనంతరం రూట్ అధికారుల ద్వారా వారి వారి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామాగ్రిని చేర్చారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ... మండల పరిధిలో 9 ఎంపిటిసి, ఒక్క జెడ్పిటిసి స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 26,200 మంది ఓటర్లు ఉన్నారని, 30 పోలింగ్ కేంద్రాలను, 189 మంది ఎన్నికల సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. అదనంగా మరో 63 మందిని రిజర్వ్ లో ఉంచామన్నారు. అవసరం మేరకు రిజర్వ్ సిబ్బందిని విధులలో ఉపయోగించుకుంటామన్నారు. 21 మంది ఎంపీటీసీ అభ్యర్థులు, ఇద్దరు జడ్పిటిసి అభ్యర్థులు పోటీపడుతున్నారన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్త్ ను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల ఓటర్లు, ఎన్నికల పాసు కలిగిన సిబ్బంది తప్ప మరెవరు అనుమతించబడరని తెలిపారు. ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన, అల్లర్లు సృష్టించిన అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడానికి అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు ఫక్రుద్దీన్ సాహెబ్, తపస్విని, డివ్యూటీ ఎంపిడిఓ బాలరాజు, లక్ష్మీపతి యాదవ్, రమేష్ బాబు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

## పోలతల హుండీల లెక్కింపు

**పెండ్లిమర్రి, నవంబరు 4, ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం పొలతల సంబంధించిన శాశ్వత హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి మూడే కృష్ణానాయక్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డి, పాలక మండలి సభ్యుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.15,65,909 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. వివిధ ఆలయాల హుండీల ఆదాయ వివరాలను ఆయన తెలిపారు. శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.4,44,648, శ్రీఅక్కదేవతల దేవస్థానం రూ.10,27,884, శ్రీబండెన్న స్వామి దేవస్థానం రూ.43,137, శ్రీపుట్టాఆంజనేయస్వామి దేవస్థానం రూ.43,708, అన్నదానం హుండీ రూ.6538 ఆదాయం వచ్చిందన్నారు. శివాలయం మిక్స్‌డ్ వెండి సుమారు 419 గ్రాములు, బంగారు సుమారు 3 గ్రాములు, శ్రీ అక్కదేవతల దేవస్థానం సంబంధించి మిక్స్‌డ్ బంగారం సుమారు 24 గ్రాములు, మిక్స్‌డ్ వెండి సుమారు 1.800 గ్రాములు వచ్చిందన్నారు. అనంతరం రాజజారెడ్డి, కృష్ణానాయక్‌లు మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా హుండీల లెక్కింపు పూర్తి చేసినట్లు తెలిపారు.

## సాంప్రదాయ ఆహార పదార్థాల వినియోగం వ్యర్థాల నియంత్రణపై అవగాహన

**పీలేరు నవంబర్ 4 ప్రభాతవార్త:**

వ్యర్థాల శాస్త్రీయ నియంత్రణతో పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యాధులు లేని శరీరాన్ని ఆశించవచ్చునని పి.హెచ్.సి తలుపుల ప్రధానవైద్యాధికారులు శ్రీ గిరీష, ,చంద్రశేఖర్ సంయుక్త ప్రకటన బుధవారం చేశారు. బ్రిక్స్ సుస్థిర జీవన శైలి వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు "సాంప్రదాయ ఆహార పదార్థాల వినియోగంవ్యర్థాల నియంత్రణ" అనే ప్రత్యేక అంశముపై పీలేరు 1 సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తినే ఆహారంలో తగు మోతాదులో పోషకాలు లోపిస్తే జీవన శైలి వ్యాధులు ప్రమాదం పొంచి ఉందని,సరైన ఆహారం, అలవాట్లు, జీవనశైలితో మెరుగైన ఆరోగ్య జీవితం ప్రతి ఒక్కరి స్వాంతమవు తుందని, తృణధాన్యాలు రోజువారీ ఆహారంలో బాగంగా చేర్చుకోవడం,మరియు ప్రోత్సహించడం, ఇంట్లోని ఆకులు, కూరగాయలు, తొక్కలు, గడ్డి లాంటి వ్యర్థాలతో సారవంతమైన ఎరువుగా (కంపోస్టింగ్) మార్చే ప్రక్రియను, అలవ ర్చుకోవడం,ఆహార వృధాను నివారించడం, లాంటి ప్రక్రియ అందరూ అలవర్చు కొని సహజ రీసైక్లింగ్ విధానానికి సహకరించాలని, కావున పర్యావరణ పరిరక్షణకోసం మనం అలవర్చుకునే మేలైన జీవనశైలితో సాధ్యమని, డా:చంద్రశేఖర్ అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోషకాలు లభ్యమ య్యే ఆహారపదార్థాలతో కూడిన "స్టాల్ " ఏర్పాటుచే సి వాటి ప్రయోజనాల గూర్చి ప్రజలకు వివరించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పి.హెచ్. యన్ కుసుమ, పర్యవే క్షకులు నాగమ్మ,రెడ్డెప్ప, ఏయన్‌యం.విజయ కుమారి, సిహెచ్ఓ అయేషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రిక్స్ సుస్థిర జీవనశైలి 2026 వారోత్సవాలు

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త**

బ్రిక్స్ సుస్థిజీవనశైలి 2026 వారోత్సవాల సందర్భంగా బుధవారం ప్రొద్దుటూరు డిపో గ్యారేజీ ఎమ్ ఎఫ్ రూమ్ నందు డిపో సిబ్బందికి ప్రముఖ న్యూట్రీషియన్ ప్రవీణ్ ఆరోగ్యం గురించి సలహాలు మరియు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దివ్యతేజను కలిసిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు

**బద్వేల్ అర్బన్, నవంబర్ 04 ప్రభాతవార్త:**

బద్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దివ్యతేజ, డాక్టర్ క్రాంతి కుమార్ లను బద్వేల్ పట్టణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల రాధాకృష్ణమూర్తి, అధ్యక్షులు కె.వి. సుబ్బారావు, దర్శి సుబ్బరాజా, మాలేపాటి సుధాకర్, పామూరు వెంకటేశ్వర్లు, పత్తి నరసింహతో పాటు పలువురు సభ్యులు చైర్ పర్సన్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు కొత్తగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని కోరారు. అలాగే బద్వేల్ పట్టణంలో ప్రజలు, పిల్లలు ఆహ్లాదకరంగా సమయం గడిపేందుకు ఇప్పటివరకు ఎలాంటి పబ్లిక్ పార్కులు లేవని, ఈ విడత (మీ టర్న్) పాలకవర్గంలోనైనా ఒక సుందరమైన పబ్లిక్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బద్వేల్ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, పట్టణాభివృద్ధికి బాటలు వేయాలని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

**దువ్వూరు, నవంబర్ 04, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నీలాపురం, చల్లబసాయి పల్లె ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరిగే పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి రవి చంద్రబాబు, ఎంపీడీవో జవహర్ బాబు, సునీతలు తెలిపారు. ఈ రెండు ఎంపీటీసీ స్థానాల్లో 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందుకు సంబంధించిన సిబ్బందిని పోలింగ్ సామాగ్రిని ఆ భద్రపరిచారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజల ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

### ఎన్నికలు నిర్వహణకు

# రాజకీయ పార్టీలు సహకరించాలి

**తంబళ్లపల్లె నవంబర్ 4 ప్రభాతవార్త ఃఃః